సాక్షి
జయశంకర్ భూపాలపల్లి
శుక్రవారం | 22 | మార్చి | 2024



అర్హుల ఆనందహేళ..

టీఎస్ ఎన్పీడీసీఎల్ పరిధిలోని 17 జిల్లాల్లో గృహజ్యోతి ద్వారా మొదటి విడతలో 19 లక్షల 70వేల మంది రూ.55.55 కోట్ల మేర లబ్ధి పొందారు. - 8లో▸



చీట్‌ఫండ్..

భవిష్యత్ అవసరాల నిమిత్తం చిన్న మొత్తంలో ప్రజలు పొదుపు చేసుకుంటున్న సొమ్మును చిట్ ఫండ్ నిర్వాహకులు దారిమళ్లిస్తున్నారు. సొమ్మును రియల్ ఎస్టేట్ రంగంలో ఇన్‌వెస్ట్ చేస్తున్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
35.4^0 /18.2^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది. రాత్రిపూట చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.



న్యూస్‌రీల్

అంబేడ్కర్ జయంతిని విజయవంతం చేయాలి



మల్హర్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ 133వ జయంతిని విజయవంతం చేయాలని ఆల్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ సొసైటీ జాతీయ అధ్యక్షురాలు వేముల జ్యోతి, రాష్ట్ర అధ్యక్షుడు లింగమల్ల శంకర్ కోరారు. అంబేడ్కర్ జయంతి ఉత్సవాలు, పూలే, అంబేడ్కర్ సేవారత్న అవార్డుల ఆహ్వాన కరపత్రాలను మండలంలోని కొయ్యూరు ప్రెస్‌క్లబ్‌లో సొసైటీ సభ్యులతో కలిసి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మెరుగైన సమాజ నిర్మాణం కోసం మహనీయుల జయంతి, వర్ధంతి వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఏవైయూ కాళేశ్వరం జోనల్ అధ్యక్షుడు చింతల కుమార్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు కేసారపు సురేందర్, సారయ్య, మమత పాల్గొన్నారు.

బార్డర్ చెక్‌పోస్టు వద్ద తనిఖీలు



కాళేశ్వరం: తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దులోని కాళేశ్వరం బార్డర్ చెక్‌పోస్టు వద్ద ఎస్సై భవానీసేన్ ఆధ్వర్యంలో గురువారం తనిఖీలు ముమ్మరం చేశారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో వాహనాల రవాణాపై పోలీసులు దృష్టిసారించారు. నగదు, మందు, మత్తుపదార్థాల సరఫరాను నియంత్రించడానికి పకడ్బందీ చర్యలు చేపడుతున్నారు. అనంతరం పలుగుల, మెట్‌పల్లి పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పలుగుల గ్రామంలో ఇసుక లారీ డ్రైవర్లతో మాట్లాడారు. ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, మద్యం తాగి లారీ నడుపవద్దని సూచించారు. ఆయన వెంట సివిల్, సీఆర్‌పీఎఫ్ పోలీసులు ఉన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి



కాటారం: పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో కొనసాగడానికి ప్రతీఒక్కరు సహకరించాలని కాటారం డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో కాటారం సబ్ డివిజన్ పరిధిలోని సివిల్, సీఆర్పీఎఫ్ పోలీసులతో సమావేశమై ఎన్నికల సమయంలో వ్యవహరించాల్సిన తీరు, బందోబస్తు, ఎన్నికల విధులపై అవగాహన కల్పించారు. సిబ్బంది ఎన్నికలపై పలు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి ప్రధాన కూడలి, చింతకాని క్రాస్ వరకు సివిల్, సీఆర్పీఎఫ్ బృందాలతో కలిసి డీఎస్పీ, సీఐ, ఎస్సైలు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. చింతకాని క్రాస్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. జాతీయ రహదారి గుండా ప్రయాణిస్తున్న ప్రతీ వాహనాన్ని నిలిపి క్షుణ్ణంగా పరిశీలించారు. వాహనపత్రాలను పరిశీలించి వాహనదారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సరైన ఆధారాలు లేకుండా అధికమొత్తంలో నగదు రవాణా చేయవద్దని ప్రతీఒక్కరు ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని డీఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ నాగార్జునరావు, ఎస్సైలు అభినవ్, ప్రసాద్, నరేశ్, మహేందర్, సివిల్, సీఆర్పీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

అడవుల సంరక్షణ అందరి బాధ్యత

ములుగు: అడవుల సంరక్షణ అందరి బాధ్యత అని ములుగు జిల్లా అటవీశాఖ అధికారి రాహుల్ కిషన్ జాదవ్ అన్నారు. ములుగు జిల్లా కేంద్రంలో ప్రపంచ అటవీ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా బండారుపల్లి బాలుర జెడ్పీ పాఠశాల, ములుగు బాలికల జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు.

సర్కార్ మారినా.. దోపిడీ మారలె..

అక్షయ పాత్రలా సాండ్ స్టాక్ పాయింట్లు

- అర్ధరాత్రి నదుల్లోని ర్యాంపుల నుంచి ఇసుక తరలింపు
- కొత్త పాలసీ కోసం ప్రభుత్వం సన్నాహాలు
- నదుల్లో తోడొద్దని సీఎం చెప్పినా పట్టించుకోని వైనం
- అన్నీ తెలిసినా పట్టించుకోని టీఎస్ఎండీసీ



మానేరు నదిలోకి చెయిన్ జేసీబీ వెళ్లిన గుర్తులు

భూపాలపల్లి: కొత్త ప్రభుత్వం వచ్చినా జిల్లాలో ఇసుక అక్రమ రవాణా మాత్రం ఆగడం లేదు. ఇసుక టెండర్ల విషయంలో బీఆర్ఎస్ హయాంలో జరిగిన వైఫల్యాలు పునరావృతం కాకుండా ఉండేందుకు ప్రస్తుత సర్కారు కొత్త పాలసీని తీసుకవచ్చేందుకు ప్రయత్నిస్తుంది. ఈ క్రమంలోనే ఇసుక క్వారీల యజమానులు అక్రమ ఇసుక రవాణాకు పాల్పడుతూ రూ.కోట్లలో దోచుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా టీఎస్ఎండీసీ అధికారులు పట్టించుకోకపోవడం పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

సీఎం చెప్పినా వినరే..

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగిందని, అప్పటి నిబంధనలు క్వారీల యజమానులకు అనుకూలంగా ఉన్నాయని, టీఎస్ఎండీసీ అధికారుల పర్యవేక్షణ కరువైందని ప్రస్తుత ప్రభుత్వం భావించింది. గత ప్రభుత్వంలో జరిగిన దోపిడీని అరికట్టాలనే ఉద్దేశంతో సీఎం రేవంత్‌రెడ్డి టీఎస్ఎండీసీతో పాటు వివిధ శాఖల అధికారులతో గత నెల మొదటి వారంలో సమీక్ష నిర్వహించారు. ప్రస్తుత ఇసుక పాలసీ అవినీతిమయంగా ఉందని, ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చడమే కాకుండా వినియోగదారుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని కొత్త పాలసీని తయారు చేస్తామని సీఎం ప్రకటించారు.

ఆ కిటుకు ఏంటంటే..

ఇసుక అక్రమ రవాణాపై కొత్త ప్రభుత్వం కొరఢా ఝులిపించాలని ప్రయత్నిస్తుండటంతో క్వారీల యజమానులు సరికొత్త దందాకు తెరలేపారు. ఆన్‌లైన్ బుకింగ్ చేసుకున్న ఇసుక క్వారీల యజమానులు పొద్దంతా స్టాక్ పాయింట్(డంప్)లలోని ఇసుకను విక్రయించుకుంటున్నారు. అనంతరం మళ్లీ అంతే ఇసుకను అర్ధరాత్రి మానేరు, గోదావరి నదుల మధ్యలో నిల్వ చేసుకున్న ర్యాంపుల నుంచి స్టాక్ పాయింట్లకు తరలిస్తున్నారు. ఫలితంగా స్టాక్ పాయింట్లలో ఇసుక తగ్గడం లేదు. సీఎం చెప్పిన ప్రకారం స్టాక్ పాయింట్లలోని ఇసుకను మాత్రమే తరలిస్తున్నామంటూ బుకాయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇసుకను సక్రమంగా విక్రయిస్తే ఏమీ మిగలడం లేదంటూ కొందరు క్వారీల యజమానులు మరో దారిలో అక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలిసింది. వివిధ కారణాలతో ఆన్‌లైన్ బుకింగ్‌ను నిలిపి వేయించుకొని రాత్రివేళల్లో నదుల మధ్యలోని ర్యాంపుల నుంచి అనుమతులు, బిల్లులు లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో ఇసుక అక్రమ రవాణా జరుగుతున్న విషయమై టీఎస్ఎండీసీ ప్రాజెక్ట్ మేనేజర్ తారక్‌నాథ్‌రెడ్డిని 'సాక్షి' సంప్రదించేందుకు ప్రయత్నించగా ఫోన్ లిఫ్ట్ చేయలేదు.

క్వారీలు, ఇసుక డంప్‌ల వద్ద సీసీ కెమెరాలు తప్పకుండా ఏర్పాటు చేయాలని, కొత్త పాలసీ వచ్చే వరకు నదుల్లోకి వెళ్లి గుప్పెడు ఇసుక కూడా తోడొద్దని, స్టాక్ పాయింట్(డంప్)ల వద్ద ఉన్న ఇసుకను మాత్రమే విక్రయించుకోవాలని ఆదేశాలు జారీచేశారు. అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు విజిలెన్స్ బృందాలు మోహరించాలన్నారు. సీఎం ఆదేశాల మేరకు విజిలెన్స్ బృందాలు గత నెల చివరి వరకు జిల్లాలోని ఇసుక క్వారీలు, స్టాక్ పాయింట్ల వద్దనే ఉండి పరిశీలించాయి. దీంతో క్వారీల యజమానులు చేసేది లేక సైలెన్స్ అయ్యారు. విజిలెన్స్ అధికారులు వెళ్లిపోవడంతో ఈ నెల ప్రారంభం నుంచి మళ్లీ ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. స్టాక్ పాయింట్ల వద్ద ఉన్న ఇసుకను ప్రతీరోజూ విక్రయిస్తున్నా ఇసుమంత కూడా తగ్గడం లేదని తెలుస్తోంది. దీని వెనుక పెద్ద కిటుకు ఉందనే ఆరోపణలు ఉన్నాయి.

అర్ధరాత్రి ట్రాక్టర్‌లో ఇసుక తరలింపు..



అర్ధరాత్రి అక్రమ రవాణా

చిట్యాల: మండలంలోని కాల్వపల్లి మానేరు వాగు, చిట్యాల మండలంలోని నవాబుపేట చలివాగు, టేకుమట్ల మండలంలోని అంకుషాపూర్ గ్రామ శివారులోని చలి వాగుల నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతుంది. గతంలో అధికారులు ఎన్నిమార్లు కేసులు పెట్టినా ఇసుక దందా ఆపడం లేదు. రాత్రి వేళలలో ముందు ఒక ద్విచక్రవాహనంపై ఓ వ్యక్తిని పైలెట్‌గా పంపించి ఆ తరువాత ఇసుక ట్రాక్టర్లను తరలిస్తున్నారు. పోలీసులు అర్ధరాత్రి వరకు తనిఖీలు చేపట్టినా అక్రమార్కులు ఇసుక దందాను కొనసాగిస్తూనే ఉన్నారు.



నదిలో జేసీబీతో ఇసుక తోడిన గుర్తులు



నదిలో భారీగా ఇసుక ర్యాంపులు

చంద్రవాహన సేవలో స్వామి వారిని ఊరేగిస్తున్న భక్తులు



గజవాహన సేవలో..

- కోటంచలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

రేగొండ: మండలంలోని కోటంచ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు గురువారం మూడవ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఉదయం నిత్యనిధి, హోమం నిర్వహించిన అనంతరం స్వామి వారిని గజవాహన సేవలో మాడవీధుల గుండా ఊరేగించారు. సాయంత్రం బలిహరణ సేవ నిర్వహించిన అనంతరం స్వామి వారిని చంద్రవాహన సేవలో డప్పువాయిద్యాల నడుమ మాడవీధుల గుండా ఊరేగించారు. అనంతరం తీర్థప్రసాదం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ ముల్కనూరి భిక్షపతి, ఆలయ ఈఓ బిల్లా శ్రీనివాస్, కమిటీ సభ్యులు మల్లెబోయిన శ్రీధర్, మూల ఓంకార్, డోలిబిలి కోటేశ్వర్‌రావు, కసుకుంట్ల జోగేందర్, పేరాల తిరుపతి, పోలుసాని శ్రీనివాసరావు, లింగంపల్లి తిరుపతిరావు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన ఐత ప్రకాశ్‌రెడ్డి



భూపాలపల్లి రూరల్: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఐత ప్రకాశ్‌రెడ్డిని ఇటీవల రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా ప్రకటించినందుకు గురువారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

టెండర్.. నో 'ఆన్సర్'!

తక్కువ కోట్ చేసినా రద్దు చేయడంపై అనుమానాలు

- కేయూలో యూజీ, పీజీ ఆన్సర్ షీట్ల డిజిటలైజేషన్ ఈ– టెండర్
- అర్హత సాధించిన మూడు సంస్థలు.. తక్కువ కోట్ చేసిన ఓ సంస్థ
- ఆ సంస్థ టెండర్ రద్దు చేసి.. మళ్లీ షార్ట్ టెండర్ నోటిఫికేషన్
- సీఎం రేవంత్‌కు ఫిర్యాదు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ(కేయూ)లో యూజీ(డిగ్రీ), పీజీ విద్యార్థుల పరీక్షల జవాబుపత్రాలను ఆన్‌స్క్రీన్ వాల్యుయేషన్ డిజిటలైజేషన్ టెండర్‌లో గోల్‌మాల్ జరిగిందా.. తక్కువ కోట్ చేసిన కంపెనీకి ఖరారు చేయకుండా రద్దు చేసి మళ్లీ షార్ట్‌టెండర్ నిర్వహించడంలో ఆంతర్యమేమిటీ..? ఎప్పుడూ లేనిది ఐదేళ్లకు ఒకేసారి ఇవ్వడం ఏమిటీ? ఇందులో ఎవరి వాటా ఎంతనేది ముందే నిర్ణయించుకుని అనుకున్న వారి(కంపెనీ)కి టెండర్ దక్కే అవకాశం లేకపోవడంతోనే ఈ విధంగా చేశారా.. అంటే యూనివర్సిటీ వర్గాలనుంచి అవుననే సమాధానం వస్తోంది.

కేయూ యూజీ, పీజీ నాన్ ప్రొఫెషనల్, ప్రొఫెషనల్ కోర్సుల జవాబుపత్రాలను ఆన్‌స్క్రీన్ ఆన్సర్ స్క్రిప్ట్ వాల్యుయేషన్ డిజిటలైజేషన్ కోసం పరీక్షల విభాగం అధికారులు గత ఫిబ్రవరి 22న ఈ–టెండర్ నోటిఫికేషన్ ఇచ్చారు. ఈ నెల 6 వరకు ఆన్‌లైన్‌లోనే టెండర్లు స్వీకరించారు. 13న ఓపెన్ చేశారు. నాలుగు కంపెనీలు టెండర్‌లు దాఖలు చేయగా, అందులో అర్హతలు లేవని ఓ కంపెనీని పక్కనపెట్టారు. మిగతా మూడింటిలో ఓ సంస్థ తక్కువగా కోట్ చేసింది. అయినా టెండర్ ప్రక్రియను పూర్తిగా రద్దు చేసి షార్ట్‌టెండర్ పిలవడంపై అనేక అనుమానాలు రేకెత్తుతున్నాయి.

తక్కువ కోట్ చేసినా రద్దు..

విద్యాసంవత్సరానికి సుమారుగా 25లక్షల స్క్రిప్టులు ఉంటాయని, వీటి డిజిటలైజేషన్ కోసం రూ.2కోట్ల విలువైన ఈ – టెండర్ ప్రక్రియను ఆహ్వానించారు. టెండర్ దక్కించుకునే సంస్థకు ఐదేళ్ల కాలపరిమితి ఉంటుందని పేర్కొన్నారు. ఓ సంస్థ ఒక్కోస్క్రిప్టుకు (32పేజీలకు) రూ.14.51, మరో సంస్థ రూ.15, ఇంకో సంస్థ రూ.27.13 కోట్ చేసింది. ఇందులో తక్కువ (రూ.14.51) కోట్‌చేసిన సంస్థకు టెండర్ ఖరారు చేయలేదు. ఆ టెండర్‌ను పూర్తిగా రద్దు చేశారు. ఎందుకు రద్దు చేశారనేది కూడా సంబంధిత సంస్థకు తెలియజేయలేదని సమాచారం. పరీక్షల నియంత్రణాధికారి మళ్లీ షార్ట్ టెండర్‌కు నోటిఫికేషన్ జారీచేశారు. తక్కువ కోట్‌చేసిన సంస్థ వారు విషయం తెలుసుకుని అవాక్కయ్యారు.

సీఎం, ఉన్నతాధికారులకు ఫిర్యాదు

టెండర్ రద్దుపై తక్కువ బిడ్ వేసిన సంస్థ ప్రతినిధి ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డికి, చీఫ్ సెక్రటరీ, ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. తాము తక్కువ కోట్ చేసి మొదటిస్థానంలో ఉన్నప్పటికి రద్దు చేసి మళ్లీ షార్ట్ టెండర్‌ను పిలిచారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే రెండోసారి ఇచ్చిన షార్ట్ టెండర్‌కు నాలుగు రోజుల సమయం మాత్రమే ఇవ్వడంపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఎన్నికల కమిషన్‌కు లేఖ..

రెండోసారి షార్ట్‌టెండర్‌ను ఈ నెల 16న ఇచ్చి 20వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించారు. దీనిని ఓపెన్ చేయాలంటే ప్రస్తుతం ఎన్నికల కోడ్ అడ్డంకిగా మారింది. దీంతో యూనివర్సిటీ అధికారులు అనుమతికోసం ఎన్నికల కమిషన్‌కు లేఖ రాసినట్లు సమాచారం. అనుమతి వచ్చాక బిడ్‌ను తెరవనున్నారు.



ఒకేసారి ఐదేళ్లకు ఇవ్వడమేమిటీ!

టెండర్ కాలపరిమిత ఒకేసారి ఐదేళ్లపాటు ఇవ్వడంలో ఆంతర్యమేమిటనే ప్రశ్న తలెత్తుతోంది. వాస్తవంగా ఏడాదిపాటు ఇచ్చి ఆ సంస్థ పనితీరుపై సంతృప్తిపడితే రెన్యువల్ చేసుకోవచ్చు లేదా మరో టెండర్ పిలుచుకునే వెసులుబాటు ఉంటుంది. కానీ ఒకేసారి ఐదేళ్ల ఇవ్వడంలో నిబంధనలకు నీళ్లు వదిలారా అనే అనుమానాలున్నాయి. వీసీ తాటికొండ రమేష్ పదవీ కాలం ఈ ఏడాది మే 23న పూర్తికాబోతుంది. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన యూనివర్సిటీ పాలకమండలి సమావేశంలో ఆన్‌లైన్ స్క్రీన్ వాల్యుయేషన్ డిజిటలైజేషన్ కోసం అప్రూవల్ ఇచ్చింది. దీంతో వెనువెంటనే టెండర్ నోటిఫికేషన్ ఇచ్చారని సమాచారం.

టెక్నికల్ సమస్యతోనే తొలి టెండర్ రద్దు

ఆన్‌స్క్రీన్ ఆన్సర్ షీట్ల స్క్రిప్ట్ వాల్యుయేషన్ డిజిటలేజేషన్ ప్రక్రియ కోసం టెండర్ పిలిచాం. నాలుగు సంస్థలు టెండరు దాఖలు చేయగా మూడు అర్హత సాధించాయి. గతంలో పీజీ కోర్సులో ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీలకే ఆన్ 'స్క్రీన్ వాల్యుయేషన్ చేశాం. ఇప్పుడు యూజీ, పీజీ అన్ని కోర్సులు కూడా చేయబోతున్నాం. అందువల్ల పలు టెక్నికల్ సమస్యలున్నాయి. దీంతో రద్దుచేశాం. వాటిని కరెక్షన్ చేసి మళ్లీ షార్ట్ టెండర్ నోటిఫికేషన్ ఇచ్చాం. ఇందులో అర్హత కలిగిన, తక్కువ కోట్ చేసిన సంస్థకే ఖరారు చేస్తాం.

- ప్రొఫెసర్ నర్సింహాచారి,
కేయూ పరీక్షల నియంత్రణాధికారి

బంగ్లాపల్లి రోడ్డులో ఎస్సారెస్పీ కాల్వలో చెట్లు, పిచ్చి మొక్కలు



ఎస్సారెస్పీ కాల్వలే..

మొగుళ్లపల్లి మండలంలో డీబీఎం–31, డీబీఎం–18 ఎస్సారెస్పీ కాల్వలు తుమ్మచెట్లు, పిచ్చిమొక్కలతో చిట్టడవులను తలపిస్తున్నాయి. కాల్వలకు మరమ్మతులు లేకపోవడంతో ఆనవాళ్లు లేకుండా పూడుకుపోతున్నాయి. దీంతో 25 సంవత్సరాల క్రితం నిర్మించిన ఎస్సారెస్పీ కాల్వలు అలంకారప్రాయంగా మారాయి. ఒక్కఎకరాకు కూడా నీరందిన పరిస్థితి లేదు. పాలకులు, అధికారులు స్పందించి నీరందించాలని రైతులు కోరుతున్నారు. – మొగుళ్లపల్లి



చెరువు లూటీ!

ఎండల తీవ్రతకు కాళేశ్వరంలోని పడిదం చెరువులో నీరు వట్టిపోతుంది. స్థానికులు గురువారం వలలతో చేపలు పట్టేందుకు భారీ సంఖ్యలో ఎగబడ్డారు. దీంతో చెరువంతా స్థానికులతో నిండిపోయి దర్శనమిచ్చింది. చేపలన్నీ పట్టుకోవడంతో చెరువు లూటీ అయింది. – కాళేశ్వరం